

'మిరియాల'కు పద్మశ్రీ

బుర్రకథకు ప్రాణం పెట్టిన అప్పారావు.. ఇటీవల మరణం.. దశదినకర్మ రోజున పద్మశ్రీ ప్రకటన.. రావులపాలెంలో ఇటు విషాదం.. అటు ఆనందం

8

కూటమి ప్రభుత్వం వచ్చింది.. అభివృద్ధికి బాటలు వేస్తోంది.. ఒక్కొక్కటి మార్చుకుంటూ వస్తోంది.. ప్రస్తుతం గుంతల రోడ్లు మారాయి.. ఎక్కడికక్కడ రోడ్లపై సాఫీగా ప్రయాణం సాగిపోతోంది.. వాట్ నెక్స్ట్ అందరూ అనుకుంటుండగానే.. ప్రభుత్వం మరో కొత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది.. అదే హాస్టల్స్.. వసతి గృహాలను వహ్వా అనేలా తీర్చిదిద్దేలా నిధులు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేయడం గమనార్హం.



ఏలేశ్వరంలో ఎస్సీ హాస్టల్

వసతి..మారెను గతి!

- ఎస్సీ హాస్టళ్లకు మంచిరోజులు
- 55 హాస్టళ్లకు రూ.8.50 కోట్లు
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు
- కూటమి సర్కారు నిర్ణయం
- హాస్టళ్ల మరమ్మతులపై దృష్టి
- టెండర్లు పిలిచిన అధికారులు
- వచ్చే నెల నుంచి పనులు
- బీసీ హాస్టళ్లకు రూ.70 లక్షలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ హాస్టళ్లకు మంచిరోజులు వచ్చాయి. నిన్నటి వరకూ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పైకప్పులు.. గతుకులమయంగా మారిన గచ్చులు.. వేలాడే తలుపులు.. ఏమాత్రం రక్షణలేని కిటికీలు.. రకరకాల విషసర్పాలకు ఆలవాలంగా మరుగుదొడ్లు.. వెలగని లైట్లు.. పని చేయని కుళాయిలు.. ఇదీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి. గడచిన ఐదేళ్లుగా వీటి బాగోగులను గత వైసీపీ ప్రభుత్వం గాలికొది లేసింది. ఏ ఒక్కడు మినహా విద్యార్థుల బాధలను కనీసం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల నుంచీ అనేక అవస్థల మధ్య విద్యార్థులు పడ్డ నరకయాతన అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని మార్చబోతోంది. ఐదేళ్లపాటు బాగోగులకు నోచుకోని వసతి గృహాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏకంగా రూ.8.50 కోట్లతో మరమ్మతులకు ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేయడానికి వీలుగా అధికారులు ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. వచ్చే నెలలో ఇవన్నీ మొదలు కానున్నాయి. అటు ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షలతో 16 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిధుల కేటాయింపులిలా..

ఎస్సీ, బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అధికారులు ఇటీవల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ బాల బాలికల వసతి గృహాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయనున్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 ఎస్సీ వసతి గృహాలకు రూ.4.93 కోట్లతో రిపేర్లు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 వసతి గృహాలకు రూ.3.83 కోట్లు, కాకినాడ జిల్లాలో 13 హాస్టళ్లకు రూ.1.23 కోట్లతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో వసతిగృహానికి అక్కడ అవసరాలను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా కోనసీమ జిల్లాలో కె.గంగవరం హాస్టల్ మరమ్మతులకు రూ.8.80లక్షలు, ఉప్పలగుప్తం రూ.14.60 లక్షలు, ముమ్మిడివరం రూ.17.60 లక్షలు, రావులపాలెం రూ.17.30 లక్షలు, అంబాజీపేట రూ.22.40 లక్షలు, ఆలమూరు రూ.25లక్షలు, రామచంద్రపురం రూ.35.30 లక్షలు. రాజమహేంద్రవరం-1 రూ.17.20 లక్షలు, ధవళేశ్వరం రూ.24.96 లక్షలు, పెద్దాపురం రూ.6.15లక్షలు. కాకినాడ అర్బన్‌లో రూ.19.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాలో తొమ్మిది బీసీ బాలబాలిక వసతిగృహాల మరమ్మతులకు రూ.38లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 8 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.29.50 లక్షల చొప్పున ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు.

పైకప్పుల మరమ్మతు చేపట్టి వసతిగృహాల్లో ఇకపై శ్లాబ్‌లకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. అలాగే గచ్చులు, తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయనున్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతారు. ఎక్కడికక్కడ కొత్త ట్యాంకుల నిర్మాణం, కుళాయిల ఏర్పాటు, కొత్త వైరింగ్ చేయనున్నారు. ఈ పనులు ఏపీ

ఏం చేస్తారంటే..

ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), ఆర్‌డబ్ల్యూ ఎస్,పీఆర్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇటీవల ఈ విభాగాలు టెండర్లు పిలిచాయి. వచ్చేనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభంకానున్నాయి.



ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారి అవార్డును కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ శనివారం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ తనకి ఈఅవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఈ అవార్డు విధుల పట్ల మరింత బాధ్యత పెంచిందన్నారు. అలాగే కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్రలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అవార్డులు స్వీకరించారు.





గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్‌లో విద్యుద్దీపాల వెలుగులు.. పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా జేసీ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, డీఆర్వో

నేడే గణతంత్ర వేడుకలు

- ముస్తాబైన కాకినాడ పోలీస్ పరేడ్ మైదానం
- ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ
- 280 మంది ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు
- కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదుగా ప్రదానం

కలెక్టరేట్(కాకినాడ),జనవరి25(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవానికి కాకినాడ పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గణతంత్ర వేడుకలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. తర్వాత సంప్రదాయ కవాతు, అనంతరం కలెక్టర్ ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి విధుల్లో విశిష్ట సేవలందించిన ఉత్తమ అధికారులకు అవార్డులను అందించి సత్కరిస్తారు. జిల్లావ్యాప్తంగా 280 మంది ఉద్యోగుల విశిష్ట సేవలకుగాను ఉత్తమ అధికార్లుగా అవార్డులు అందజేయనున్నారు. దీనిలో తొమ్మిది మంది ఉద్యోగులకు జిల్లా ఉత్తమ అధికార్లుగా అవార్డులు ఇస్తున్నారు. వీరిలో కాకినాడ పోర్టు అధికారి కెప్టెన్ కేఎస్ ధర్మశాస్త్ర, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి పి.త్రినాథ్, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్‌లు ఉన్నారు. అలాగే జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్, మత్స్యశాఖ జేడీ కె.కరుణాకర్‌రావు, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్య కుమారి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, పిఠాపురం మున్సిపాల్టీ కమిషనర్ కనకరావులు ఉన్నారు. అలాగే జిల్లాలో రెవెన్యూ, పోలీసు విభాగాల్లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగులు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. కాగా గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను శనివారం జేసీ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, డీఆర్వో వెంకటరావు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కాకినాడ రూరల్ తహశీల్దార్ కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఓటర్ల దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ మీనా

ఓటర్ల దినోత్సవ ర్యాలీ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైనదని, ఓటు ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు కాకినాడ నగర పాలక సంస్థ, అర్బన్ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలో నగరపాలక అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొనగా జేసీ రాహుల్‌మీనా జెండా ఊపి ప్రారంభించారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. జేసీ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై అందరిలో అవగాహన, చైతన్యం కలిగించేందుకు ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఓటింగ్‌లో అందరూ పాల్గొంటే మంచి ఫలితాలు వస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వాడపల్లి భక్త జనసంద్రం

- ఏకాదశి కావడంతో భారీ సంఖ్యలో భక్తుల రాక
- వెంకన్న నామ స్మరణతో మార్మోగిన ఆలయం
- శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు



భక్తులతో రద్దీగా ఉన్న వెంకన్న ఆలయ ప్రాంగణం

ఆత్రేయపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలకరించారు. స్వర్ణశోభితుడైన శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు జరిపారు. భారీ క్యూలైన్ల ద్వారా మండపం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తుల భారాలు, కానుకలు సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీలలిత కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులతో వచ్చి దర్శించుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికి, విశేష పూజలు అందించారు. ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



విజయనగరం ఎంపీ అప్పలనాయుడుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉప కమిషనర్ చక్రధరరావు

'మిరియాల'కు పద్మశ్రీ అవార్డు



సీఎం చంద్రబాబుతో మిరియాల అప్పారావు(ఫైల్)

- కళకు ప్రాణం పెట్టిన అప్పారావు
- బుర్రకథకు ప్రత్యేక గుర్తింపు ఈయనతోనే
- బుర్రకథతో ప్రేక్షకులను మెప్పించడంలో దిట్ట
- 365 రోజుల్లో 300 బుర్రకథలు
- 5వేలకు పైగా బుర్రకథల స్టేజీ ప్రోగ్రాంలు.. ఎన్నో అవార్డులు, బిరుదులు
- పుట్టింది కాకినాడ జిల్లా నడకుదురు
- అనారోగ్యంతో ఈనెల 15న రావులపాలెంలో మృతి.. శనివారం దశదినకర్మ రోజేనే పద్మశ్రీ ప్రకటన

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, టీవీలు ప్రాచుర్యం లేని రోజుల్లో బుర్రకథకు మంచి క్రేజ్ ఉండేది. జాతర్లలో కళాకారులు స్టేజీపై బుర్రకథ చెబుతుంటే ప్రేక్షకులు ఈలలు, కేరింతలు, తప్పట్లతో కళాకారులను ప్రోత్సహిస్తుంటే, ఆ కథలు తెల్లవారే దాకా అలుపెరగకుండా కళాకారులు కళకు ప్రాణం పెట్టి బుర్రకథను చెప్పేవారు. కళకు ప్రాణం పెట్టి ఆ కళలో నవరసాలు పండించడంలో మిరియాల అప్పారావుకు సాటిలేరు అంటే అది అక్షరసత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ముఖ్యంగా కోనసీమతో అనుబంధం ఉన్న మిరియాల అప్పారావు 1949లో కరప మండలం నడకుదురు గ్రామంలో మిరియాల వెంకటరామయ్య- తిరుపతమ్మలకు జన్మించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి డ్రాయింగ్ మాస్టర్, జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం గురువుల వద్ద శిష్యరికం చేసి ప్రధాన కథకునిగా ప్రావీణ్యం పొందారు. అనంతరం అక్కడ మొదలుపెట్టిన ప్రస్థానం వెనుతిరిగి చూడకుండా ఎన్నో స్టేజీ ప్రోగ్రాంలు చేశారు. 1974లో ఆల్ఇండియా రేడియోలో, 1993లో దూరదర్శన్‌లో ప్రోగ్రాంలు ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించిన బుర్రకథ పోటీలో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్‌ను ముప్పన రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన ఘనుడు ఈయన. 50 ఏళ్ల బుర్రకథ ప్రస్థానంలో అలుపెరగకుండా ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ప్రస్తుతం బుర్రకథ చెప్పేవారిలో 70 శాతం మంది కళాకారులు ఈయన శిష్యులే. ఈయనకు గానగంధర్వ, గాన కోకిల, బుర్రకథ టైగర్, బుర్రకథ మాస్టర్, బుర్రకథ పితామహుడు, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులను, బిరుదులను పొందారు.

5 వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు...

కళల రంగంలో ప్రావీణ్యం చెందిన మిరియాల అప్పారావు నవరసాలు పండించడంలో ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. దీనిలో భాగంగా ఆయన తణుకు షణ్ముఖ ఆంజనేయరాజు నేతృత్వంలోని నాటక కళా సమితిలో పలు నాటకాల్లోనూ ఈయన నటించారు. శ్రీకృష్ణతులాభారంలో కృష్ణుడు, చింతామణిలో బిల్వమంగళుడు పాత్రలతో ప్రేక్షకుల మదిని దోచారు. ఈయన 1969 నుంచి ప్రారంభించిన స్టేజీ ప్రోగ్రాంలు ఆయన ఓపిక ఉన్నంత వరకు కొనసాగిస్తు వచ్చారు. ఇప్పటివరకు 5 వేలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు ప్రదర్శించారు.



కుటుంబమే కళారంగం....

మిరియాల అప్పారావు కుటుంబం ఆయనతోపాటు కళారంగంలోనే కొనసాగుతున్నారు. అప్పారావుకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. వారిలో రావులపాలెంలో ఉంటున్న బ్రహ్మాజీ, సుబ్బరాజు, బాబా అనే కుమారులు, వీరనాల లలిత (రావులపాలెం) యడవల్లి శ్రీదేవి (తాడేపల్లిగూడెం) అనే ఇద్దరు కుమార్తెలు కూడా బుర్రకథ కళారంగంలోనే కొనసాగుతుండడం విశేషం.

విచారకరంలో ఆనందకరమైన విషయం..

ఎన్నో స్టేజీ ప్రోగ్రామ్‌లు అందించి ఎందరో ప్రేక్షకులన మన్నలను పొంది కళారంగానికి వన్నెతెచ్చిన మిరియాల అప్పారావు ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో రావులపాలెంలోని ఆయన కుమారుడు బ్రహ్మాజీ ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. కళారంగంలో ప్రావీణ్యం చెందిన అప్పారావు మృతితో కుటుంబ సభ్యులు, ఆయన శిష్యబృందం విచాకరంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుతో ఆనందం వ్యక్తం చేశారు. ఆయన పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- పోలీసుల గాలింపు ముమ్మరం

పెద్దాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ కామాంధుడు నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురంలో శనివారం జరిగింది. చిన్నారి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని భర్త వదిలేశాడు. దీంతో చిన్నారులను పోషించుకునేందుకు ఆ తల్లి కూలీ పనులకు వెళ్తోంది. గ్రామంలో అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన చిన్నారి ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించిన పాలిక వీరబాబు అనే కామాంధుడు చిన్నారిపై లైంగిక దాడికి యత్నించడంతో చిన్నారి గట్టిగా ఏడ్చింది. ఇది గమనించిన స్థానికులు అక్కడకు రావడంతో వీరబాబు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మౌనిక విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది. నిందితుడు పరారవ్వడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ
- విమానాశ్రయ ఘటనపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్



విమానాశ్రయం వద్ద కూలిన టెర్మినల్ షెడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం (రాజమహేంద్రవరం) టెర్మినల్ విస్తరణ పనుల్లో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి విమానాశ్రయంలో జరిగిన ప్రమాదస్థలిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కొంత కాలంగా ఇక్కడ టెర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మొదటి అంతస్తు పై కప్పు ఏర్పాటు చేస్తుండగా పైన ఉన్న గిడ్డర్ల బోల్టులు బిగించడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. ఏదిఏమైనా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మరింత జాగ్రత్త వహించాలన్నారు. ఈ విషయంపై కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడతామన్నారు. దీనికి సంబంధించి నివేదికను అధికారులతో తెప్పించుకుని ఏ విధంగా ముందుకెళ్లాలో పరిశీలిస్తామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరి పరిశీలన

విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ ప్రదేశాన్ని శనివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైన ఉన్న గిర్డర్ల బోల్ట్‌లు బిగించడం వల్లే ప్రమాదం జరిగినట్టు ఆమెకు అధికారులు వివరించారు. కాంట్రాక్ట్ తీసుకున్న చెన్నై రెనాటస్ ప్రాజెక్టు ఎండీ మనోజ్ పూసప్పన్, వైస్ ప్రెసిడెంట్ ఖరుబాకరమ్, ప్రాజెక్టు డీజీఎం శరవణ్‌ను నిలదీశారు. ఈ ఘటనపై ఎంపీ మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో మాట్లాడానన్నారు. ఇప్పటికే విమానయాన అధికారులు విచారణ చేపట్టారని చెప్పారు. నివేదిక అందిన తరువాత నిర్మాణంలో లోపాలు ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



అధికారులను వివరాలు అడుగుతున్న ఎంపీ పురందేశ్వరి

మేరా భారత్ మహాన్

- పల్ల వెంకన్న నర్సరీలో ఆకట్టుకుంటున్న ఎర్రకోట వనకూర్పు ఆకృతి



నర్సరీలో మొక్కలతో రూపొందించిన రిపబ్లిక్ డే ఆకృతి

కడియం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కడియపులంకలోని పల్ల వెంకన్న నర్సరీలో పల్ల సత్తిబాబు, ఆయన కుమారులైన వెంకటేష్, వినయ్ మేరా భారత్ మహన్ అంటూ మొక్కలతో రిపబ్లిక్ డే ఆకృతులను రూపొందించారు. మువ్వన్నెల జెండా, ఎర్రకోటతో అక్షరమాలికను తీర్చిదిద్దారు. 76వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్టు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ తెలిపారు.

మద్యానికి బానిసై... భార్యతో తరచూ గొడవలు

- అత్తమామ చేతిలో ప్రాణాలు కోల్పోయిన అల్లుడు



గణేష్ మృతదేహం

కడియం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మద్యానికి అలవాటు పడి భార్యతో తరచూ గొడవ పడుతున్న వ్యక్తి అత్తమామ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఉదంతం కడియపులంకలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... కోరుకొండ గ్రామానికి చెందిన శ్రీరంగం సూర్యవెంకట గణేష్ (36) రెండేళ్ల కిందట తన భార్య మాధవి, ఇద్దరు పిల్లలతో కలిసి కడియపులంకలో నివాస ముంటున్నాడు. గణేష్‌కు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో భార్యతో తరచూ గొడవపడేవాడు. ఎప్పటిలాగే ఈనెల 24వ తేదీ సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యతో ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గణేష్ అత్త నాగమణి, మామ సత్తిబాబు అడ్డుపడి తలమీద బలంగా కొట్టి గాయపరిచారు. దీంతో విషయం తెలుసుకున్న గణేష్ బంధువులు 108లో హెచ్‌సీకి తరలించారు. అయితే వైద్యులు అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఉదయ భాస్కరరావు ఫిర్యాదు మేరకు సీఐ ఏ. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



దర్శనాంతరం డీఆర్ఎంతో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడిని శనివారం విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఆనందరావు పాటిల్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. దీనిలో భాగంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి ప్రసాదాలు ప్రదానం చేశారు. వీరితోపాటు పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత పెంటయ్య

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఓ దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన మురముళ్ల పెంటయ్య ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

ప్రమాదవశాత్తూ రైలు నుంచి పడి వ్యక్తి మృతి

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరుకు చెందిన కడిమి వెంకటరమణ శనివారం ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈయన హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో అన్నవరంలో బంధువుల ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు రైల్వే హెచ్‌సీ శ్యామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. 30 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుంది. ఎరుపు రంగు షర్టు, లోపల అపోలో టైర్స్ కంపెనీ టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించినట్టు చెప్పారు. బంధువులు గుర్తించేందుకు వీలుగా మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

రెండోరోజూ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కోటి

పెద్దాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): : ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే కళ అని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి) అన్నారు. పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో గుమ్ములూరి లక్ష్మీనారాయణ కళాప్రాంగణంలో ఉభయ రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు రెండోరోజు శనివారమూ కొనసాగాయి. కురుమెళ్ల వెంకటరమణ, మరుకుర్తి సత్తిబాబు కళావేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, ఇంధన బ్రహ్మానందం, స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు, గోపు నారాయణమూర్తి , తదితరులు పాల్గొన్నారు.

చక్కటి సందేశాన్నిచ్చిన స్వేచ్ఛనాటిక..

స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదని, మన మనసుకు నచ్చినట్టు మన ఇష్టం వచ్చినట్టు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడానికి ఆడ, మగ ఎవరైనా స్వేచ్ఛలో నిర్ణయాత్మక నియంత్రణ సంరక్షణతో కూడిన నియంత్రణ ఉండాలని, స్వేచ్ఛకు హద్దే ముద్దు అని చక్కటి సందేశాన్ని ఇచ్చేలా ప్రదర్శన సాగింది. సహృదయ ద్రోణాదుల(బాపట్ల) వారు ప్రదర్శించిన వర్క్ ఫ్రం హోమ్ ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. ఆహుతులను నవ్వులు పూయించింది. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ (వెలగలేరు) వారు ప్రదర్శించిన రాత నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. పోలుదాసు శ్రీనివాసరావు ఈ నాటికకు రచన, దర్శకత్వం వహించారు.

పశువుల అక్రమ రవాణా



గోవులను తరలిస్తున్న వ్యాన్

ప్రత్తిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను శనివారం పోలీసులు అడ్డుకున్నారు. తుని నుంచి రాజమండ్రికి వ్యాన్‌లో 16 ఆవులను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం చెప్పారు. ఆవులను ఏలేశ్వరంలోని గోశాలకు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ కొని నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ముమ్మిడివరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనికి సంబంధిచిన వివరాలివి.. మలికిపురానికి చెందిన నెల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా అమలాపురం నుంచి మోటారు సైకిల్‌పై వెళుతున్న అయినవిల్లి మండలం యరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, భట్నవిల్లికి చెందిన తాడి మల్లపరాజు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వై-జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన నలుగురిని అంబులెన్సులో హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి : జడ్పీ సీఈవో

పి.గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల పరిధిలోని ముంగండ తాగునీటి ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంపీడీవో గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, బొండాడ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ పి.రవీంద్రబాబు, జేఈ జి.జయశ్రీ, నేత వెర్రియ్య ఉన్నారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

పెద్దాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు బారులుతీరారు. ఆలయానికి మొత్తం రూ.2,21,512 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. 4వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన

పెద్దాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చెస్ క్రీడాకారుడు ముప్పన జ్ఞానసాయిసంతోష్‌ను కుడా ఛైర్మన్ తుమ్మలబాబు శనివారం అభినందించారు. సెర్బియా దేశంలో మార్చిలో జరిగే అండర్-17 విభాగంలో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించనుండడంతో అతడ్ని అభినందించారు.

మెప్మా మార్కెట్ ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించి ప్రతినెలా ఏర్పాటు చేసే మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడలో శనివారం ప్రారంభించారు. ఆనందభారతి గేట్ వెలుపల ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. టీపీఆర్వో కె.శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పరిశీలించారు. మెప్మా సీఓలు, సెల్లర్ పాయింట్ డీఆర్‌పీ అమృతకల్యాణి,ఆర్పీలుపాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. గొల్లప్రోలు పట్టణానికి చెందిన రాజనాల వెంకన్న(35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో తల్లిదండ్రులు, భార్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఈ నెల 21వతేదీ రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ముగిసిన ఆన్‌లైన్ ఫ్యాకల్టీ ప్రోగ్రాం

జేఎన్టీయూకే, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆరు రోజుల నుంచి అటల్ అకాడమీ సహకారంతో నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసినట్లు సమన్వయకర్త వీవీ సుబ్బారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఏడీసీ కేటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, కాకినాడ జేఎన్టీయూ వైస్‌ఛాన్సలర్ మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల ప్రతిజ్ఞ చేసి ఐదుగురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. 8మంది యువ ఓటర్లకు జేసీ, కమిషనర్, వీసీ చేతుల మీదుగా ఈ ఎపిక్ కార్డులు అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కాకినాడ పట్టణ నియోజకవర్గానికి సంబంధించి 2024 సాధారణ ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు ప్రశంసాపత్రాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.పృథ్వీచరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, రాజకీయ పార్టీ ప్రతినిధులు జి.సాయిబాబా, ఆర్.వెంకటేశ్వరావు, కె.కృష్ణమోహన్, కాకినాడ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకుమారి, ఎన్నికల డీటీ కె.గోవిందరాజు, బి.రాజు పాల్గొన్నారు.

‘ఓటు హక్కు బాధ్యతగా భావించాలి’

జీజీహెచ్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని డీఎంహెచ్‌ఓ జె.నరసింహనాయక్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు, టీబీ అధికారి డాక్టర్ రోణంకి రమేష్, ఇన్‌చార్జ్ డీఎంఓ డాక్టర్ రవికుమార్, విల్సన్, డెమో ప్రసాద్‌రాజు, ఏఓ దేవకుమారి, ఎస్‌ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల స్థాయిలో ఉండూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు తహశీల్దార్, కొప్పిరెడ్డి సాంబమూర్తి, కొప్పిరెడ్డి రాజాల బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. సూపరింటెండెంట్ పద్మజ పాల్గొన్నారు. సామర్లకోట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించగా కమిషనర్ శ్రీవిద్య ప్రతిజ్ఞ చేయించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

జేఎన్టీయూకే, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని సెనేట్ హాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకుని జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును శనివారం సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ పాల్గొన్నారు. అతిథులు, విద్యార్థులతో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

కరపలో..

కరప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు అని, ఆ ఓటుహక్కును ప్రతీఒక్కరూ సద్వినియోగంచేసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని కరప తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం కరప జడ్పీ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఓటుహక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ విద్యార్థులు నిర్వహించిన డిబేట్ ఆహుతులను ఆకట్టుకుంది. తదనంతరం ర్యాలీ నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఆర్ఐ సీహెచ్.పవన్, వీఆర్‌వోలు శర్మ, నాగేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటుహక్కు సామాన్యుడి చేతిలో వజ్రాయుధం అని ఆర్డీవో కె.శ్రీరమణి అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆమె శనివారం మాట్లాడారు. తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రలోభాలకు తలొగ్గి ఓటుహక్కును వినియోగించుకోకూడదన్నారు. ఆర్డీవో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించడంతోపాటు కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి ఆర్డీవో, తహశీల్దార్ ఓటరు గుర్తింపు కార్డును అందచేశారు. ఆర్డీవో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో..

సర్పవరం జంక్షన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు అనే వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని మండల తహశీల్ధార్ ఎస్ఎల్ఎన్ కుమారి కోరారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో మోహన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

తిమ్మాపురం అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 సంయుక్త ఆధ్వర్యంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ఘనంగా 15వ ఓటర్ల దినోత్సవం జరిగింది.

పిఠాపురంలో..

పిఠాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును నిర్దేశించడంలో ఓటుహక్కు కీలకపాత్ర పోషిస్తుందని పలువురు వక్తలు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం పట్టణంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు శనివారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల ప్రశాంత నిర్వహణకు కృషి చేసిన పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను, సీనియర్ ఓటర్లను సత్కరించారు. తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం ఈవో ఆర్.సౌజన్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ మురళీకృష్ణ

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలులో శనివారం జరిగిన కార్యక్రమంలో గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ సీనియర్ ఓటర్లను సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రెడ్డి, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు విలువను గుర్తించాలని కొత్తపల్లి తహసీల్ధార్ జి.చిన్నారావు విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. తర్వాత సీనియర్ ఓటరుకు తహసీల్ధార్ ఆధ్వర్యంలో దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఆర్ఐ మధుసూదనరావు, పీఈటీ రవిరాజ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణ

తాళ్లరేవు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు ఎంతో దోహదపడతాయని పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ అన్నారు. 17 గ్రామ పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన కార్యదర్శులు గ్రామసభలను శనివారం నిర్వహించారు. కోరంగిలో తాగునీటిని రొయ్యల కంపెనీలు, ఐస్ ఫ్యాక్టరీలకు వాడుతున్నారని స్థానికుడు వాసు ఆరోపించారు. పి.మల్లవరంలో డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లరేవు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పుట్టినరోజును పురస్కరించుకుని కోరింగ పంచాయతీ సీతారామపురంలో ఏర్పాటు చేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్ పోస్టరును మురమళ్లలో శనివారం ఆవిష్కరించారు. కోరింగ యూనిట్ ఇన్‌చార్జ్ టేకుమూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 9, 10, 11వ తేదీల్లో సీతారామపురం కోలాటివారి రేవువద్ద మెగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మాజీఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ నేతలు గుత్తులసాయి, కట్టా త్రిమూర్తులు, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

కరప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పెనుగుదురులోని దేవదాయశాఖకు చెందిన భూమిలో ఏర్పాటుచేసిన అక్రమ కట్టడాలను శనివారం అధికారులు తొలగించారు. పెనుగుదురులో కాకినాడ బొగ్గవరపు సుబ్బారావు ట్రస్ట్‌కు చెందిన భూమిలో నిర్మించిన షెడ్డును దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.వెంకటదుర్గాభవాని తొలగించారు. ఈవోలు శివబాబు, మోర్తా మురళీవీరభద్రరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల కృత్రిమ పరికరాల స్క్రీనింగ్

సర్పవరం జంక్షన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాకలపూడిలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో జాయినింగ్ హేండ్స్ చారిటీ సంస్థ, డాక్టర్ ఎంవీఆర్ ఆరోగ్య, విద్యా ట్రస్ట్ వారి సహకారంతో దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాల స్క్రీనింగ్ యాంప్యూటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి వచ్చిన డాక్టర్ రఘునాథ, పునరావాస వైద్యనిపుణుడు సునీల్‌కుమార్ కృత్రిమ పరికరాల స్క్రీనింగ్‌లో పాల్గొని 36మందికి అవసరమైన పరికరాలు, సముచిత వినియోగం, స్టంప్ సంరక్షణ, హైజిన్, ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు చేశారు. పీడీ కె.నారాయణరెడ్డి, ఏవో జి.పార్థసారథి, ఇన్‌చార్జి ఎస్.ఉమారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంసీ జర్నల్ తొలి సంచిక ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యతను బయట ప్రపంచానికి తెలియపరిచేందుకు గ్లోబల్ జర్నల్ ఎంతగానో దోహదపడుతుందని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. ఆర్ఎంసీ గ్లోబల్ జర్నల్ తొలిసంచికను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్యవిద్యలో నూతన ఒరవడితో కూడిన ఎన్నో ప్రయోగాత్మకమైన పరిశోధనలు చేసి సఫలీకృతులైన విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య విద్యార్థులకు తెలిపేందుకు ఈ గ్లోబల్ జర్నల్ ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగాఉన్న పరిశోధకుల మధ్య విమర్శనాత్మక ఆలోచనలను ఈ గ్లోబల్ జర్నల్ ప్రోత్సహిస్తుందన్నారు. అంతర్జాతీయ అకడమిక్ వేదికపై రంగరాయన్ల ప్రతిష్టను పెంచుతుందన్నారు. దేశం వైద్యవిద్య ప్రమాణాలు ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఐఆర్‌సీఎఫ్ ఛైర్మన్, సీవీఆర్ మాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఎస్ఎస్ సీ చక్రరావ్, డాక్టర్ ఎస్‌వీ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎడార లోకేష్, వైస్ ప్రిన్సిపాల్ శశి పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ ఎవోల్వ్‌డ్ బై ది ఫ్యూచర్ కారు


కియా సిరోస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కియా సిరోస్ ఎవోల్వ్‌డ్‌బై ది ఫ్యూచర్ కారును కంటిపూడి కియా సీఈవో కామేష్, వినియోగదారులు మార్కెట్‌లోకి విడుదల చేశారు. కాకినాడ నగరంలోని కంటిపూడి కియా షోరూమ్‌లో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో కామేష్ మాట్లాడుతూ ఈ కారు శక్తివంతమైన పెట్రోల్, డీజిల్ ఇంజిన్స్, ఆటో అండ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్, 16 లెవెల్ 2 అదర్ ఫీచర్స్, 6 ఎయిర్ బ్యాగ్‌లు, డ్యూయల్ పానారోమిక్ సన్‌రూఫ్, 12.3 ఇంచ్ టచ్ స్క్రీన్ నావిగేషన్ కాకిట్స్ కలిగి ఉందన్నారు. హార్మన్ కాటన్ ప్రీమియం 8 స్పీకర్స్ సౌండ్ సిస్టమ్‌తో కియా కనెక్ట్ 2.0, ఓటీఏ సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ విత్ కియా రియోట్ డయాగ్నోస్టిక్స్ స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫయర్ విత్ ఏక్యూఐ డిస్‌ప్లే, స్మార్ట్ డాష్ కామ్ విత్ డ్యూయల్ కెమెరా లాంటి మరిన్ని అత్యాధునిక ఫీచర్స్‌తో ఈ కారు అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ ఛైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి(చినబాబు), కె.మన్మోహన్‌రామ్, బ్రాంచ్ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

వెల్‌నెస్ క్లినిక్ సేవలు వినియోగించుకోవాలి: ఎమ్మెల్సీ పద్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

జీజీహెచ్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే నిరుపేద రోగులు వెల్‌నెస్ క్లినిక్ సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సూచించారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా జీజీహెచ్ ప్రాంగణంలోని ఓపీ నెం.19లో శనివారం సామాజిక వైద్య విద్యా విభాగం ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పద్మశ్రీ వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమ, బుధవారాల్లో ఈ క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలోని ఓపీ విభాగం బయట ఓటర్ల దినోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్యేతర సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ ఎన్.రాజకుమారి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుజాత, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

‘పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం చేయూత’


పశువైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పాడిపశువుల పెంపకం ద్వారా జీవనోపాధి పెంపునకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం ఉండూరు పశువైద్యకేంద్రంఆవరణలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ సూర్యప్రకాష్, సామర్లకోట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి ఎమ్మెల్యే హాజరై 150పశువులకు నట్టల నివారణ మందులు అందించారు.

తాళ్లరేవు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రైతులు పశు సంరక్షణ పద్ధతులపై జాగ్రత్తలు వహించాలని ఏడీ బ్రహ్మావేద అన్నారు. తాళ్లరేవులో శనివారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరంలో పశువులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన దాణాలను, మందులను రైతులకు పంపిణీ చేశారు.

రోగులకు వైద్యం చేయని డాక్టర్‌పై చర్యలు చేపట్టాలి

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

కొత్తపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగులను సరిగా పట్టించుకోని సీనియర్ డాక్టర్‌పై చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్‌వర్మ డిమాండ్‌చేశారు. కొమరగిరి ప్రాథమిక వైద్య‌ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)లో సీనియర్ డాక్టర్ రోగులను పట్టించుకోవడంలేదన్న ఫిర్యాదుల మేరకు శనివారం ఆయన పీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆస్పత్రికి వైద్య సేవలకోసం వచ్చిన రోగులను వైద్యసదుపాయాలపై ఆయన ఆరాతీయడంతో డాక్టర్ అసలు పట్టించుకోవడంలేదని వారు వివరించారు. రోగులకు సేవలందించని సీనియర్ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు విజ్ఞప్తి చేశారు. కొమరగిరి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కఠారి రాజబాబు, మాజీ జడ్పీటీసీ చైతన్యరాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల క్రికెట్ పోటీలు

పిఠాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో న్యాయవాదుల క్రికెట్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.రాజారావు, ఎస్ఎంఆలీజట్లు బరిలోకి దిగాయి. రాజారావు జట్టుపై ఆలీ జట్టు విజయం సాధించింది. ఉప్పు అప్పారావు ను మ్యాన్‌ఆఫ్‌దిమ్యాచ్‌గా ఎంపిక చేశారు. సోమిరెడ్డి కోటి, పెదిరెడ్ల నంది అంపైర్లుగా వ్య వహరించారు. బార్‌అసోసియేషన్ న్యాయవాదులకు టీషర్టులను అందజేసింది.ప్రధాన కార్యదర్శి భాస్కర్,స్పోర్ట్స్ సెక్రటరీ బుజ్జిపాల్గొన్నారు.

కాకినాడ ఆర్డీవో, అర్బన్ తహసీల్దార్‌లకు అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దార్ జితేంద్ర

కాకినాడసిటీ,జనవరి 25(ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ప్రధాన అధికారి కార్యాలయంలో ఎన్నికల ఉపనిర్వహణ అధికారిగా అందించిన సమర్థవంతమైన ఉత్తమ సేవలకుగాను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఉత్తమ ఎన్నికల ఉప నిర్వహణ అధికారిగా పురస్కారం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శని వారం జరిగిన రాష్ట్రస్థాయి ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ అవార్డును కాకినాడ ఆర్డీవో మల్లిబాబుకు ప్రదానం చేశారు. ఆర్డీవో మల్లిబాబుకు ఈ పురస్కారం దక్కడంపట్ల డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఆర్డీవో కార్యాలయసిబ్బంది, రెవెన్యూసిబ్బందిహర్షం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకుగాను అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర ఉత్తమ ఎన్నికల అసిస్టెంట్ ఆర్‌వోగా అవార్డు అందుకున్నారు.

యువ శాస్త్రవేత్తల తయారీకి సైన్స్ లేబొరేటరీలు దోహదం: డీఈవో


కోరమండల్‌లో సైన్స్ లేబొరేటరినీ పరిశీలిస్తున్న డీఈవో

సర్పవరంజంక్షన్,జనవరి25(ఆంధ్రజ్యోతి): భావిభారత యువ శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు సైన్స్‌లేబొరేటరీలు ఎంతగానో దోహదం చేస్తాయని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో రూ.10లక్షల నిధులతో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నిర్మించిన సైన్స్ లేబరేటరీ(మ్యాథ్స్, బోటనీ, జువాజీ,ఫిజిక్స్)ని ఆ సంస్థ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన కోరమండల్ ఇంటర్నేషనల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కోరమండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించేలా అధునాతంగా నిర్మించిన ఈ సైన్స్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ల్యాబ్‌ని పరిశీలించి పలు ప్రయోగాలు చేశారు. ల్యాబ్‌ని తీర్చిదిద్దిన పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కె.గాయత్రి, జువాలజీ లెక్చరర్ పాల్‌రాజ్, జగదీష్‌లను అభినందించారు. డీఈవో రమేష్, హెడ్ శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు.

ఏడో రోజు సంగీత విద్వత్సభ గాన కచేరి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 25(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో ఏడోరోజు కార్యక్రమంగా కల్లూరి శ్రీనివాస్ గాత్రం, మృదంగం వారే పాడుతూ వాయించడం కష్టమైన కొత్త ప్రక్రియ చక్కగా చేసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. వీరికి వయోలిన్‌పై ఎస్.పార్థివ, విశాఖ ఘటంపై బోడపాడు చక్కటి సహకారాన్ని అందించారు. ముమ్మిడి రామకృష్ణ సీఎస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంవీజీ కృష్ణంరాజు, నల్లమిల్లి మణిబాబు, అనంత్, వక్కలంక రామకృష్ణ, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, చావలి సూర్యకుమారి, సంగీత విద్వాంసులు, సంగీతయ ప్రియులు పాల్గొన్నారు.

ఐస్ కర్లింగ్‌లో సత్తా చాటిన క్రీడాకారులకు అభినందన



కాకినాడ అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఐస్ క ర్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను శనివారం డీఎస్ఏ ప్రాంగణంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ అభినందించారు. జమ్మూకశ్మీర్‌లోని గుల్‌బర్గ్‌లో ఈనెల 17నుంచి 21 వరకు జరిగిన పో టీల్లో సబ్‌జూనియర్ పురుషుల జట్టు బంగారు పతకం సాధించింది. జట్టులోని క్రీడాకారులు ఎన్.శేషురిషిత్‌రెడ్డి, బి.నాగేంద్రఠాకూర్, కె.ష ణ్ముక్, చైతన్య, హర్షలతో పాటు మిక్సిడ్ డబుల్స్‌లో కాంస్య, జట్టులో రజతపతకాలు సాధించిన బి.శ్రీదేదీప్యను అభినందించారు. కర్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.తేజశ్రీ, శిక్షకుడు హరికృష్ణ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి: ఏఐవైఎఫ్

పిఠాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ, సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ డిమాండ్ చేశారు. పిఠాపురంలో శనివారం ఏఐవైఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. సంఘ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పీతల సుభాష్, వి.లోవ, ఉపాధ్యక్షుడిగా శాఖా సిద్దు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలెం కిరణ్, సహాయ కార్యదర్శిగా ఉప్పటి నానిబాబు, యువ మహిళా కార్యదర్శిగా గీత, కోశాధికారిగా సాయికృష్ణ ఎన్నికయ్యారు.

రేపు, ఎల్లుండి తునిలో దివ్యాంగులకు వాలీబాల్ పోటీలు

తుని రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తునిలో ఈ నెల 27, 28 తేదీల్లో దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు జనసేన నాయకుడు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు 120 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. డి.స్వరూప్, సీహెచ్ గణేష్, జె.సంతోష్, బి.గోవింద్, బి.సత్యనారాయణ, బి.వెంకటరాము, రాజు, బంగారి, సుంకర సాయి, బి.మధు, సూర్య, సురేంద్ర, అరుణ్ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

హైడ్రాలిక్ టెస్ట్ విజయవంతం



మోతుగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్తగా నిర్మించిన 5,6 యూనిట్లలో కనస్ట్రక్షన్‌లో భాగంగా శనివారం 5వ యూనిట్‌లో స్పైరల్ కాజింగ్ హైడ్రాలిక్ టెస్ట్ విజయవంతంగా జరిగింది. చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఆదేశాలతో ఏపీ జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో విజయవాడ విద్యుత్ సౌద నుంచి హైడల్ డైరెక్టర్ ఎం.సుజయ్‌కుమార్, తన బృందాన్ని కొత్తగా నిర్మించిన 5,6యూనిట్ల పనితీరును పరిశీలించడానికి పంపించారు. ఈటెస్ట్ హైడల్ డైరెక్టర్ ఎం.సుజయ్‌కుమార్ సమక్షంలో జరిగింది. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటిండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, సివిల్ సీఈ కోటేశ్వరరావు, ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, కనస్ట్రక్షన్ కంపెనీ ఎస్ఎస్ఈ, పీఈఎస్‌లు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

- ఐటీడీఏ పీవో అపూర్వ భరత్
- ఘనంగా ఓటర్ల దినోత్సవ ర్యాలీ

చింతూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో శనివారం జాతీయ ఓటర్ల దినో త్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత సీనియర్ సిటిజన్స్ దంపతులను సన్మానించారు. పోలవరంఎస్‌డీసీ అంబేడ్కర్, తహశీల్దార్ చిరంజీవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ మీనా పాల్గొన్నారు.

మంచి సమాజానికి పునాదులు

రంపచోడవరం, జనవరి 25: ఓటు హక్కు వినియోగంతో యువత మంచి సమాజానికి పునాదులు వేయాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రంపచోడవరం తహశీల్దారు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రసాంత్, ఎంపీడీవో శ్రీనివాసదొర పాల్గొన్నారు.

విద్యార్థులతో ర్యాలీ

రాజవొమ్మంగి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అల్లూరి జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

ఓటర్ల దినోత్సవ ర్యాలీ

వై.రామవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక బస్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్సు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

మెరుగైన జీవన శైలి కల్పించడమే పోలీస్ కర్తవ్యం

చింతూరు, జనవరి25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన జీవన శైలి కల్పించడమే పోలీస్ కర్తవ్యమని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా అన్నారు. చింతూరు మండలం అల్లిగూడెంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం, క్రీడా పోటీలు నిర్వహించారు. 250మంది ఆదివాసీలు వైద్య సేవలు పొందారు. వాలీబాల్ పోటీల్లో 20బృందాలు పాల్గొన్నాయి. అల్లిగూడేనికి చెందిన టీమ్ విజేతగా నిలిచింది. సర్పంచ్ పేగా చంద్రయ్య, సీఆర్ పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చేతన్, సీఐ నాగేంద్రప్రసాద్, చింతూరు ఎస్ఐ రమేష్, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

మన్యం బాలికలు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

రంపచోడవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మన్యంలోని బాలికలు ఉత్తమ విద్యాభ్యాసాలతో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శనివారం రంపచోడవరం మండలం ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన జాతీయ కిశోరి బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో బాలుర కంటే ముందుండటానికి కృషి చేయాలన్నారు. డీఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ బాలికలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు.

చిన్నారిగండిలో అగ్నిప్రమాదం

దేవీపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నారిగండి గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లో వంట చేయగా ఉండిపోయిన అగ్నిరవ్వలు కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లో ఐదు గ్యాస్ సిలెండర్లు ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామంలో ఉన్న యువకులు, పెద్దలు మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇంట్లో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. తహశీల్దార్ సత్యనారాయణ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ ఎవోల్వ్‌డ్ బై ది ఫ్యూచర్ కారు



కియా సిరోస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కియా సిరోస్ ఎవోల్వ్‌డ్ బై ది ఫ్యూచర్ కారును కంటిపూడి కియా సీఈవో కామేష్, వినియోగదారులు మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగరంలోని కంటిపూడి కియా షోరూమ్‌లో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఈవో కామేష్ మాట్లాడుతూ ఈ కారు శక్తివంతమైన పెట్రోల్, డీజిల్ ఇంజిన్స్, ఆటో అండ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్, 16 లెవెల్ 2 అదర్ ఫీచర్స్, 6 ఎయిర్ బ్యా గ్‌లు, డ్యూయల్ పానారోమిక్ సన్రూఫ్, 12.3 ఇంచ్ టచ్ స్క్రీన్ నావిగేషన్ కాకిట్స్ కలిగి ఉందన్నారు. హార్మన్ కాటన్ ప్రీమియం 8 స్పీకర్స్ సౌండ్ సిస్టమ్‌తో కియా కనెక్ట్ 2.0, ఓటీఏ సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ విత్ కియా రియోట్ డయాగ్నోస్టిక్స్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫయర్ విత్ ఏక్యూఐ డిస్‌ప్లే, స్మార్ట్ డాష్ కామ్ విత్ డ్యూయల్ కెమెరా లాంటి మరిన్ని అత్యాధునిక ఫీచర్స్‌తో ఈ కారు అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్, బ్రాంచి మేనేజరు మహేష్ పాల్గొన్నారు.

'అంబేద్కర్‌కు బీజేపీ అత్యున్నత గౌరవం'

ప్రత్తిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు తమ పార్టీ అత్యున్నత గౌరవం ఇస్తోందని బీజేపీ జిల్లా నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, సింగిలిదేవి సత్తిరాజు, కర్రి ధర్మరాజు పేర్కొన్నారు. స్థానిక నైపుణ్య మహిళా డిగ్రీ కళాశాలలో బీజే పీ మండల అధ్యక్షుడు వూటా వీరబాబు అధ్యక్షతన శనివారం సా యంత్రం సంవిధ గౌరవ్ అభియాన్ సమావేశం నిర్వహించారు. కళాశాల చైర్మన్ గండ్రేడి సత్తిబాబు, ప్రిన్సిపాల్ ఈగల రాంబాబు, బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, గున్నాబత్తుల రాజబాబు, నానిపల్లి శ్రీనివాస్, రామకుర్తి సూర్యనారాయణ, వూటా భాస్కర్, శెట్టి గంగబాబు, నంద లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు




ఏలేశ్వరం, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

ఓటు హక్కే వజ్రాయుధం

ఏలేశ్వరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనరు సత్యనారాయణ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీ చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత నేతృత్వంలో విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్చార్జి ప్రగడ ప్రయాగమూర్తి, సురేష్, మదీనా, శ్రీలక్ష్మి, శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిరిపురం గ్రామంలో సీనియర్ ఓటరు అచ్చె సూర్యారావును సత్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవులపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్



ప్రత్తిపాడు మండలం పాండవులపాలెంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దారు సూర్యప్రభ

ఎ.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎం.సూర్యప్రభ ఓటు విశిష్టత, ఆవశ్యతను వివరించారు. విద్యార్థినులు ఇండియా మ్యాప్ ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. పాండవులపాలెం సర్పంచ్ గుమ్మిడి రామలక్ష్మితో పాటు సీనియర్ ఓటర్లను సన్మానించారు. డిప్యూటీ తహసీల్దారు పుణ్యవతి, ఆర్ఐ గోపాలకృష్ణ, ఎంహెచ్‌వో కె.నాగబాబు, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం భాయ్ పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఓటు హక్కును వినియోగించుకోవడం వల్ల కలిగే లాభాలను ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ టి.ప్రశాంతి తెలియజేశారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): గెద్దనాపల్లిలో వీఆర్వోలు ఇస్మాయిల్, లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ ములేటి భవానీ గంగాధర్, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దారు జె.చిరంజీవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. హెచ్ఎం డి.వెంకటపతిరాజు, మురళి, శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, కె.జానకిరామయ్య, రమణ, నూకరాజు, వీరబాబు పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు మురార్జీ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఓటు విలువను గుర్తించి ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దారు ఓటు విలువను వివరించారు. డిప్యూటీ తహసీల్దారు వీరేష్, ఆర్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు ప్రసాద్ అధ్యక్షతన రేఖవానిపాలెంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో యువత ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. సీనియర్ ఓటర్లను సన్మానించి ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు.



తొండంగి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



తునిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి

'ఆదిత్య'లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

గండేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కాలేజీలో రోడ్డు సేఫ్టీ, ఫిర్యాదు పరిష్కారం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రత్తిపాడు జేసీజే కోర్టు ప్యానల్ అడ్వకేట్ దేవి అవసరాల, యల్లసావరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్ అవసరాల హాజరయ్యారు.

మహిళా పోలీస్ రాజ్యలక్ష్మికి ఉత్తమ బీఎల్వో అవార్డు



జగ్గంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యంవారిపాలెం గ్రామ మహిళా పోలీసు డి.రాజ్యలక్ష్మికి ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్ అవార్డు దక్కింది. విజయ వాడలో జరిగిన ఓటర్ల దినోత్సవంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి సర్టిఫికెట్, షీల్డు, రూ.5వేలు నగదు అందుకున్నారు.

దీపం కుందె బహూకరణ

కిర్లంపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి సుమారు ఐదు కిలోల బరువున్న ఇత్తడి దీపం కుందెను కిర్లంపూడి జూనియర్ కాలేజీ మాజీ చైర్మన్ ఎస్ఎస్ రాంకుమార్ శనివారం అర్చకులకు అందించారు. దీనిని గురువాయూరు శ్రీకృష్ణదేవాలయం నుంచి తీసుకొచ్చినట్లు తెలిపారు.

సత్యదేవునికి ప్రాకార సేవ

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి ప్రాకార సేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తీసుకొచ్చి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించారు. భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఈవో వీర్ల సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.